ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 14 మార్చి 2024

టీడీపీ నుంచి ఎవరెక్కడ?

- నేడు విడుదల కానున్న రెండో జాబితాపై సర్వత్రా ఆసక్తి


వెంకటగిరి అభ్యర్థి లక్ష్మీ సాయిప్రసన్న

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేడు విడుదల కానున్న తెలుగుదేశం అభ్యర్థుల జాబితాపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆసక్తితో ఎదురు చూస్తోంది. ఈ రెండు జిల్లాల పరిధిలో తొలి జాబితాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. తిరుపతిని మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలలో ఒకదానికి కేటాయించే అవకాశముంది. ఇక మిగిలిన ఏడు స్థానాల్లో అభ్యర్థులెవరన్న దానిపైనే ఇప్పటిదాకా కొనసాగిన సస్పెన్స్ నేడు తొలగిపోయే ఆస్కారముంది.

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో పుంగనూరు, మదనపల్లె, పూతలపట్టు, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి తదితర ఏడు అసెంబ్లీ స్థానాలు పెండింగులో ఉన్నాయి. గురువారం విడుదల కానున్న రెండవ జాబితాలో ఈ స్థానాలు అన్నింటికీ అభ్యర్థులను ప్రకటిస్తారా లేక కొన్ని స్థానాలు పెండింగ్‌లో పెడతారా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంటోంది. నిజానికి చంద్రగిరిలో పులివర్తి నాని, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి, పూతలపట్టులో మురళీమోహన్, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డిలకు అధికారికంగా ప్రకటించలేదు కానీ టికెట్లు ఎప్పుడో ఖరారయ్యాయి. అయితే తొలి జాబితాలో వీరి పేర్లు ప్రకటించకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. మార్పులేమైనా వుంటాయేమోనన్న అనుమానాలకు అవకాశం ఏర్పడింది. అయితే టికెట్ల ప్రకటనతో నిమిత్తం లేకుండా అధిష్ఠానంపై నమ్మకంతో ఈ నాలుగు స్థానాల్లో ఇంఛార్జులు ఎన్నికల ప్రచారానికి ఎప్పుడో శ్రీకారం చుట్టేశారు. ఇప్పటికే ఒకటికి రెండు సార్లు ప్రతి గడపా తొక్కి ఓట్లు అభ్యర్థించారు. కాగా పూతలపట్టు అభ్యర్థిని నేటి జాబితాలో వెల్లడించకపోవచ్చని సమాచారం. వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నడుమ పోటీ వుండగా తాను ఆత్మకూరు నుంచీ పోటీ చేస్తానని ఆనం ప్రకటించడంతో రామకృష్ణకు లైన్ క్లియర్ అయింది. అయితే ఆఖరి నిమిషంలో అధిష్ఠానం రామకృష్ణకు కాకుండా ఆయన కుమార్తె లక్ష్మీ సాయిప్రసన్నకు టికెట్ ఖరారు చేసింది.ప్రముఖ పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌కు కోడలు కూడా అయిన లక్ష్మీ సాయిప్రసన్న పేరు రెండవ జాబితాలో ప్రకటించే అవకాశముంది.

ఏడు స్థానాల్లో నేడు ఎన్నింటికో?

సత్యవేడు, మదనపల్లెలపైనే అందరి చూపు

ప్రత్యేక పరిస్థితుల కారణంగా సత్యవేడు, మదనపల్లె నియోజకవర్గాలపైనే అందరి చూపూ పడుతోంది. సత్యవేడులో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైసీపీని వీడి టీడీపీకి చేరువైన సంగతి తెలిసిందే. అక్కడ టీడీపీ టికెట్ ఆదిమూలానికే ఖరారైనట్టు సమాచారం. అయితే టికెట్ ఆశిస్తున్న ఇతర నేతల సంఖ్య ఎక్కువగా వున్నందున వారందరినీ పిలిపించుకుని సర్దిచెప్పాల్సి వుందని, అంతే కాకుండా పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత రాకుండా ఆచితూచి అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. నియోజకవర్గంలో ఇవన్నీ సర్దుబాటు చేసిన తర్వాతే ఆదిమూలం పేరు ప్రకటించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. కాబట్టి గురువారం వెలువడే జాబితాలో సత్యవేడు పేరు వుండదని సమాచారం. ఇక మదనపల్లె విషయానికొస్తే అక్కడ కూడా టీడీపీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే వుంది. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ నుంచీ టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు టికెట్ ఖరారు చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ముస్లిం మైనారిటీలు అధికంగా వున్న మదనపల్లెలో వందల కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తులను కాపాడ్డంతో పాటు ఆ భూముల్లో భారీ షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించి వక్ఫ్ బోర్డుకు భారీగా ఆదాయాన్ని పెంచిన నేతగా ఆయనకు మైనారిటీ వర్గాల్లో హీరో వర్షిప్ వుంది. అధిక శాతం ముస్లింల మద్దతు ఆయనకే వుండడంతో అధిష్ఠానం షాజహాన్ వైపు మొగ్గుచూపినట్టు సమాచారం. అయితే అక్కడ ఆశావహులకు నచ్చజెప్పాల్సి వున్నందున గురువారం జాబితాలో ఈ స్థానం పెండింగ్ పెట్టచ్చన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

చిత్తూరు ఎమ్మెల్యేకి తిరుపతి సీటు!

అభ్యర్థి ఎంపికకు జనసేన తీవ్ర కసరత్తు... పలువురి పేర్ల పరిశీలన

సర్వేలో వ్యతిరేకత వచ్చినా ఆరణి వైపే జనసేనాని మొగ్గు



తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన సీటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖరారైంది. టీడీపీ-బీజేపీలతో పొత్తు కూటమిలో వున్న జనసేనకు తిరుపతి సీటు కేటాయించిన సంగతి తెలిసిందే.టీడీపీ పరంగా తిరుపతి అసెంబ్లీ సీటు తొలినుంచీ కీలకమే. ప్రతిసారీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపికపై స్థానికంగానే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా జనం ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈ పర్యాయం జనసేనతో పొత్తు కారణంగా అభ్యర్థి ఎంపిక మరింత ఆసక్తికరంగా మారింది. ఆరు నెలల కిందటే జనసేనతో పొత్తు వుంటుందని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకే కేటాయిస్తారన్న అంచనా జనంలో మొదలైంది. ఓ దశలో తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిని ఢీకొనగలిగే వనరులు జనసేన నాయకులకు లేవన్న అభిప్రాయం కలగడంతో సీటు టీడీపీకే దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఈలోపు సీట్ల సర్దుబాటు జరగడంతో తిరుపతి సీటు జనసేనకు కేటాయించారు. ఆ వెంటనే బీజేపీ కూడా కూటమిలో చేరడంతో తిరుపతి సీటును బీజేపీ కోరుతుందన్న ప్రచారం ప్రారంభమైంది. ఆలోగా చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. సీటు ఏ పార్టీకన్న ప్రచారాలు ఓవైపు సాగుతుండగానే మరోవైపు పరిణామాలు వేగంగా మారిపోయాయి.తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, ఊకా విజయ్ కుమార్ జనసేనలో చేరి టికెట్ తెచ్చుకునేందుకు సిద్ధపడ్డారు. వీరి ప్రయత్నాలు కొనసాగుతుండగానే రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి బుధవారం జనసేనలో చేరారు. తిరుపతి టికెట్ కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయన పట్ల అత్యధికులు వ్యతిరేకత కనబరిచినట్టు తేలడంతో ఆయన పేరు పక్కన పెట్టి గంటా నరహరి వైపు మొగ్గు చూపుతున్నారని జనసేన, టీడీపీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ గంటల వ్యవధిలో ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. కాగా ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గ జనసేన, టీడీపీ వర్గాలలో కలకలం రేపాయి. స్థానికులైన బలిజలకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు ఎమ్మెల్యేకి టికెట్ ఖరారు చేయడం వివాదం రేగేందుకు అవకాశమిస్తోంది. ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం పట్ల టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల స్పందన ఎలా వుంటుందో, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఈ రెండు పార్టీల్లో ఎలాంటి సమీకరణలకు దారితీస్తుందో వేచి చూడాల్సి వుంది.

వైసీపీ ప్రచారంలో ఎస్ఐ


రాజేష్‌తో ఎస్ఐ వెంకట నరసింహులు

సత్యవేడు, మార్చి 13 : సత్యవేడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ ప్రచారంలో ఎస్ఐ వెంకట నరసింహులు పాల్గొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో బుధవారం రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ ప్రచారంలో రాజేష్‌తో ఎస్ఐ వెంకట నరసింహులు సన్నిహితంగా మెలుగుతూ ప్రచారంలో పాల్గొన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిజానికి రాజేష్ ప్రస్తుతానికి అభ్యర్థి మాత్రమే. అధికారికంగా ఎటువంటి ప్రోటోకాల్ వర్తించదు. నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ దాఖలు చేసిన తరువాత ప్రభుత్వమే అభ్యర్థికి గన్‌మెన్‌ను కేటాయిస్తుంది.ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.31
సహరి (శుక్రవారం) : 5.02





ధ్వజావరోహణం - సింహాసనం, కామధేనువులపై శివపార్వతుల పురవిహారం

సింహాసనంపై శివయ్య వైభవం

- ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం


ధ్వజావరోహణం సందర్భంగా పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 13: శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో బుధవారం రాత్రి దేవరాత్రిని పురస్కరించుకొని శివపార్వతులు కైలాస మేరుపర్వత సింహాసనం, కామధేనువుపై పురవిహారం చేశారు.అంతకు ముందు ఉత్సవాలకు ధ్వజావరోహణ కార్యక్రమం ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజ స్తంభం వద్ద కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి, అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. వేదోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర కలశాలను అర్చకులు శిరస్సుపై దాల్చి ఆలయంలో ప్రదక్షిణ చేసిన తరువాత స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి వృషభ సంకేత ధవళ పతాకం, కొడి వస్త్రాలు అవనతం చేశారు.అనంతరం ధవళ పతాకాన్ని, దారాన్ని చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకులకు దర్శింపచేశారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కేడిగ వాహనంపై ఊరేగించాక వసంత మండపంలో త్రిశూలానికి, స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో గురువారం విశిష్టమైన పల్లకీసేవను నిర్వహించనున్నారు.

వలంటీర్లతో పౌర సమాచార సేకరణ

శ్రీకాళహస్తి, మార్చి 13 : వలంటీర్లతో పౌర సమాచారం సేకరించేందుకు యంత్రాంగం సన్నద్ధమైనట్లు తెలిసింది. వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు వెళ్లి ఆధార్ కార్డులను నమోదు చేసుకోవడం... వాటికి లింక్ అయిన తాజా సెల్ ఫోన్ నెంబర్లను పక్కాగా నమోదు చేసుకోవడంపై కసరత్తు జరుగుతోంది. శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో గురువారం నుంచి పౌర సమాచారం సేకరించే ప్రక్రియను చేపట్టనున్నట్లు సమాచారం.ఇందుకు సంబంధించి బుధవారం పురపాలక సంఘ అధికారులు సచివాలయ, వలంటీర్ల గ్రూపుల్లో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.అయితే ఎన్నికల వేళ ప్రజలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 13: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వి.శేఖర్ పేర్కొన్నారు.వచ్చేనెల 11వ తేదీ వరకు గడువుందన్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. జిల్లా పరిధిలోని 5 కేజీబీవీలలో అర్హులైన వారు దరఖాస్తు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.2లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.4లక్షలు కలిగిన అనాథ, బడి బయట పిల్లలు, డ్రాపవుట్స్, బీపీఎల్ కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వలస కార్మికులు, తల్లిదండ్రుల్లో ఒకరే ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను కేజీబీవీ వెబ్‌సైట్ నుంచి పొందాలని, మరిన్ని వివరాల కోసం ఆర్జీఈ టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించాలని కోరారు.

శ్రీవారికి థ్యాంక్స్

- గామి సక్సెస్‌పై హీరో విశ్వక్ సేన్


విశ్వక్‌సేన్, చాందిని

తిరుమల/తిరుపతి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తన 'గామి' చిత్రం విజయవంతమైన నేపథ్యంలో శ్రీవేంకటేశ్వరస్వామికి థ్యాంక్స్ చెప్పడానికి తిరుమలకు వచ్చినట్టు హీరో విశ్వక్ సేన్ తెలిపారు. చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత, హీరోయిన్ చాందినితో కలిసి ఆయన బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం విశ్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రతి సినిమా విడుదలకు ముందు, తర్వాత స్వామి దర్శనానికి రావడం ఆనవాయితీ అన్నారు.'గామి' మంచి విజయాన్ని సాధించిన క్రమంలో స్వామికి ధన్యవాదాలు తెలిపేందుకు వచ్చానన్నారు. హీరోయిన్ చాందిని మాట్లాడుతూ.. గామి చిత్రాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలన్నారు. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ.. గామి విజయం ప్రేక్షకులు ఇచ్చిందన్నారు. మొదటిసారి తన తల్లితో కలిసి స్వామిని దర్శించుకుని ధన్యవాదాలు తెలిపానన్నారు. విశ్వక్‌సేన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. వారిలో కొంతమంది మొబైళ్లను విశ్వక్‌సేన్ సరదాగా లాక్కున్నారు. కాసేపు ఆటపట్టించిన తర్వాత తిరిగిచ్చేశారు.బుధవారం సాయంత్రం తిరుపతిలో నిర్వహించిన 'గామి' సక్సెస్ మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ చాలా రిస్క్‌తో తీసిన గామి విడుదలై నాలుగురోజులైనా కలెక్షన్స్ తగ్గలేదంటూ ఆనందం వ్యక్తం చేశారు.

అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి మెమోలు

- చెక్ పాయింట్‌లో తనిఖీల తీరు మారాలంటూ ఆదేశం
- టోల్‌గేటుకు అదనంగా 20మంది గార్డుల కేటాయింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


అలిపిరి టోల్‌గేట్‌లో బుధవారం నాటి తనిఖీలు

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సిద్ధం సభ నుంచీ నిషేధిత వస్తువులతో ఆర్టీసీ బస్సులు తిరుమల కొండపైకి చేరుకున్న ఘటనలో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి టీటీడీ సీవీఎస్వో మెమోలు జారీ చేశారు.మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు చెక్ పాయింట్ ఎలా దాటాయి? అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్త టీటీడీ వర్గాల్లో కలకలం రేపింది. టీటీడీ సీవీఎస్వో ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ సభ నుంచీ నిషేధిత వస్తువులతో బస్సులు అలిపిరి చెక్‌పాయింట్ దాటిన సమయంలో విధుల్లో వున్న ఏడుగురు విజిలెన్స్ సిబ్బందిని, ఐదుగురు ఎస్పీఎఫ్ సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి మందలించారని సమాచారం. వీరితో పాటు విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్‌ను కూడా పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మీదట భద్రతా లోపాలు బయటపడితే చెక్‌పాయింట్ ఇన్‌ఛార్జిపై తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించినట్టు తెలిసింది. కాగా బుధవారం నుంచీ అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు ముమ్మరమయ్యాయి. తిరుమల నుంచీ అదనంగా 20 మంది గార్డులను అలిపిరి చెక్‌పాయింట్‌కే కేటాయించారు. ప్రతి యాత్రికుని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ క్రమంలో వాహనాలు టోల్‌గేట్ దాటడానికి ఆలస్యమైనా పరవాలేదని స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా బుధవారం టోల్‌గేట్ వద్ద తనిఖీల తీవ్రత పెరిగింది. వాహనాల కదలికలు కూడా మందగించాయి. ఉన్నతాధికారుల ఆగ్రహంతో అప్రమత్తమైన చెక్ పాయింట్ సిబ్బంది కట్టుదిట్టంగా తనిఖీలు జరిపారు. తనిఖీల సందర్భంగా సెక్యూరిటీ గార్డులు కఠినంగా వ్యవహరించడంతో యాత్రికుల నుంచీ స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ బాటిళ్ళు భారీ సంఖ్యలో పోగుపడ్డాయి.

పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో సర్టిఫికెట్‌తో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13: పద్మావతి మహిళా యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. యూనివర్సిటీ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నిర్వహణకు ఐఎస్ఓ-21001:2018, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టంకు ఐఎస్ఓ-14001:2015తో పాటు ఎన్విరాన్‌మెంట్ సిస్టం, గ్రీన్ జోన్, రెయిన్ హార్వెస్టింగ్ విధానాలను అమలు చేస్తున్నందుకు గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డును కూడా పొందింది. ఈ మేరకు హైదరాబాదుకు చెందిన హైమ్ ఇంటర్నేషనల్ ఎండీ ఆలపాటి శివయ్య తెలిపారు. ఈ గుర్తింపు యూనివర్సిటీ పాటిస్తున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రమాణాలకు సంకేతమని వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పేర్కొన్నారు. ఈ గుర్తింపు సాధన కోసం పనిచేసిన వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అండ్ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరిని అభినందించారు.

గణపతి, సుబ్రమణ్యా స్వామి విగ్రహాల ప్రతిష్ఠ



కలశాలను తీసుకెళుతున్న శివశంకర్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 13: చంద్రగిరి సమీపంలో వెలసిన నాగాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం గణపతి, సుబ్రమణ్యా స్వామి విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. వేదపండితులు శివరామ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉగ్రాణం గురుస్వామి ఆధ్వర్యంలో అఖండ భజన జరిగింది. ఈకార్యక్రమంలో నాగాలమ్మ ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి



వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శిస్తున్న ఎంఈవో లలితకుమారి

చంద్రగిరి, మార్చి 13: ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలని ఎంఈవో లలితకుమారి అన్నారు. చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో సైన్స్ ఎక్స్‌పోను బుధవారం ఆమె ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలు తయారు చేసి ప్రదర్శించి చక్కగా వివరించారు. స్కూల్ ఛైర్మన్ హితేందనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో 'బాబు ష్యూరిటీ'

పాకాల, మార్చి 13: ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని సూరినేనివారిపల్లె, అగ్రహారం, ఉప్పరపల్లె గ్రామాలలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి పులివర్తి నాని సోదరి ధనలక్ష్మి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. సూరినేనిపల్లె శివాలయంలో పూజలు జరిపారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

భాకరాపేట, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మస్తాన్ వలీ సూచించారు. భాకరాపేట, చిన్నగొట్టిగల్లుల్లో కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఎస్‌ఐలు విజయ్ కుమార్ నాయక్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మొగరాలలో ఏనుగుల సంచారం



ఏనుగులు తొక్కివేసిన వరిపంట

పాకాల, మార్చి13: మొగరాల పంచాయతీ గెరికినట్లు, చల్లావారిపల్లె, సిద్దయ్యగారి ఇండ్లు పరిసరాలలో మంగళవారం రాత్రి ఏనుగుల సంచరించి వరి, మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. ఐదారు నెలలుగా పదిపుట్లబైలు, దామలచెరువు, పేరసానిపల్లె, ఈపాలగుట్టపల్లె పంచాయతీల పరిధిలో ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఏనుగుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

తిరుపతి(రూరల్),మార్చి13: మండలంలోని పలు పంచాయతీల్లో తుడా నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు.శ్రీనివాసపురంలో రూ.3.37కోట్లు, పద్మావతిపురంలో రూ.5కోట్లు, ఓటేరులో రూ.6.59కోట్లు, కుంట్రపాకంలో రూ.3కోట్లతో చేపట్టిన పనులతోపాటు సాయినగర్, తనపల్లె, కేసీపేట, దుర్గసముద్రం, చిగురువాడ, అవిలాలో చేపట్టిన అభివృద్ధిపనులను ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఎంపీపీ యశోద, వైస్‌ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, ఎంపీటీసీ ఎక్స్ అఫిషియోసభ్యులు షేక్ హసీనా, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు. తనపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత ఆసరాచెక్కు రూ.10.59కోట్లను మోహిత్‌రెడ్డి మహిళలకు అందజేశారు.

చంద్రగిరి మండలంలో...

చంద్రగిరి, మార్చి 13: మండలంలోని శానంబట్ల, పిచ్చినాయుడుపల్లె,రాయలపురం,దోర్నకంబాల, గంగుడుపల్లె, చంద్రగిరి, రెడ్డివారిపల్లె, తొండవాడలలో అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఇందులో సీసీ రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, సమావేశమందిరాలు, తారురోడ్లు, గ్రావెల్‌రోడ్లు ఉన్నాయి.ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, వైసీపీ విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్‌గుప్తా, సర్పంచులు ఎంపీటీసీలు, వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు మండలంలో...

భాకరాపేట, మార్చి 13: 'తుడా' నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపీపీ యుగంధర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు.చిన్నగొట్టిగల్లు మండలంలోని 13 పంచాయతీలలో 'తుడా' నిధులతో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు, జగనన్న సమావేశ మందిరాలు, వాటర్ ప్లాంట్లను నిర్మించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ సహదేవరెడ్డి, జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, సర్పంచులు విమల, మనోహర, భూపాల్, రోజారమణి, ధనలక్ష్మి, శశిప్రియ, మాధవి, రెడ్డమ్మ, కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకాల మండలంలో...


పాకాల, మార్చి 13: మండలంలోని గాదంకి, ఇరంగారిపల్లె, లింగనపల్లె, కెవడ్డేపల్లె, ఆదెనపల్లె, పంటపల్లె, సామిరెడ్డిపల్లె, బైనపల్లె పంచాయతీలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సమావేశ మందిరాలు, సచివాలయ భవనాలు, ఆర్వో ప్లాంట్‌లు, రైతు భరోసా కేంద్రాలను బుధవారం ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా పంచాయతీలలో జరిగిన ప్రారంభోత్సవాలలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి లక్ష్మి ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, ఎంపీడీవో నాగేంద్రబాబు, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ కస్తూరి, వైసీపీ నాయకులు నంగా నరేష్‌రెడ్డి, కేశవరెడ్డి, కపిలేశ్వరరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సురేష్, ఇరుగు నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీపురం మండలంలో...

రామచంద్రాపురం, మార్చి 13: మండలంలోని సి.రామాపురం, కుప్పంబాదూరు, మిట్టకండ్రిగ, చిట్టత్తూరు,కాలేపల్లి, నెత్తకుప్పం సచివాలయాల పరిధిలో ప్రభుత్వం, తుడా ఉమ్మడి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు.ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ డిల్లీరాణి, సర్పంచ్ మురగయ్య, మాజీ ఎంపీపీ దామోదర రెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరి బోర్డు ఛైర్మన్ రఘునాథరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబునాయుడు, వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు కృష్ణవేణమ్మ,మంజుల,మండల వైసీపీ ఇన్‌ఛార్జి సుధాకర రెడ్డి , చెవిరెడ్డి ధ్యానేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు టూరిస్టు బస్టాండుకు
వేలంపాట ఆదాయం రూ.2.89కోట్లు

- గత యేడాది కంటే రూ.34లక్షలు అధికం



వేలం పాటల్లో డీఎల్‌పీవో రూపారాణి,ఈవో శివశంకరరాజు

తిరుచానూరు, మార్చి 13: తిరుచానూరు గ్రామపంచాయతీ టూరిస్టు బస్టాండు లో 2024-25వ సంవత్సరానికి ఆశీలు వసూలు చేసేందుకు నిర్వహించిన వేలంపాట ద్వారా రూ.2.89కోట్లు ఆదాయం లభించింది. బుధవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో రూపారాణి, ఈవోపీఆర్డీ గిరిధర్ ఆధ్వర్యంలో టూరిస్టు బస్టాండు వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన కాంట్రాక్టరు నాగిరెడ్డి రూ.2.89 కోట్లకు వేలం దక్కించుకున్నాడు. గత ఏడాది కంటే ఈ యేడాది రూ.34లక్షలు ఆదాయం పెరిగినట్లు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు తెలిపారు. ఇక జీఎస్టీతో కలుపుకుంటే ప్రభుత్వానికి సుమారు రూ.3.40 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని పంచాయతీ అధికారులు తెలిపారు. ఇక పంచాయతీ దుకాణ సముదాయం వేలంపాటలో పాల్గొనడానికి ఎవరూ రాకపోవడంతో వాయిదావేశారు.

జంగావాండ్లపల్లెలో ఇంటింటి ప్రచారం

భాకరాపేట, మార్చి 13:చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లెలో బుధవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ వాటి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జెల్లంకొండ మురళి, ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు పులివర్తి వినీల్,ఆర్వీ రమణారెడ్డి, మునస్వామి నాయుడు, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి రెడ్డి, ముత్తం ప్రభాకర్, రమేశ్ రెడ్డి, ఫణీంద్రనాథరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, జైచంద్రారెడ్డి, జేడీ బాలాజీ, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, వెంకటరత్నం, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల జోరు



ఎర్రావారిపాలెం, మార్చి13: ఎర్రావారిపాలెం మండలంలో బుధవారం జరిగిన 'మన ఊరికి మన నానీ' కార్యక్రమంలో పులివర్తి నాని సమక్షంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. యల్లమంద, ఉస్తికాయల పెంట, కోటకాడపల్లె పంచాయతీలలో నాని పర్యటించారు. ఉస్తికాయలపెంట పంచాయతీలో నాగరాజ నాయుడు, భాస్కర్, కొండారెడ్డి, చలపతి, రమణ, నాగయ్య, వెంకటరమణ, చిన్నప్ప, మురళి, జనార్దన్, నారాయణ రెడ్డి, అల్లావుద్దీన్, యల్లమంద పంచాయతీలో శ్రీరాములు, సురేంద్ర, సుబ్బయ్య, జయచంద్ర, శంకర, మహేష్, నాగయ్య, మల్లేశ్వర, పాపయ్య, నారాయణ, ప్రతాప్, చిన్నరమణ, రాజశేఖర్, అయ్యగారిపల్లెకు చెందిన వెంకటేశ్వర రెడ్డి, జయ, నరసింహులు, వెంకటరమణతోపాటు మరికొందరు టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటానని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, నాయకులు వేణు నాయుడు, చంద్రశేఖర నాయుడు, అలుగంటి నిరంజన్, చిన్నపరెడ్డి, మురళి, నాగరాజ, రాజశేఖర్, విశ్వనాథరెడ్డి, సురేంద్రబాబు,కేశవులు నాయుడు, గోపి పాల్గొన్నారు.

జూన్ నెల రూ.300 ప్రత్యేక దర్శన
టికెట్ల కోటా 25న విడుదల
18, 21 తేదీల్లో శ్రీవారి ఆర్జిత సేవల కేటాయింపు

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జూన్ నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు.ఇదే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోసం భక్తులు ఈనెల 18వ తేదీ ఉదయం 10 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సేవలకు ఎంపికైన భక్తులు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న జ్యేష్టాభిషేక ఉత్సవాల్లో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంచుతారు.అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణిట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటాను విడదల చేస్తారు. మార్చి25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని శ్రీవారి సేవా కోటాను, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను,ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

బాలమందిర్ పాఠశాల బాలుడి అదృశ్యం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 13: స్థానిక బాలమందిరంలో చదువుతున్న విద్యార్థి తప్పిపోయిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వెస్ట్ పోలీసుల కథనం మేరకు...రేణిగుంట బుగ్గవీధికి చెందిన ముని నిరంజన్ 4వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న భాకరాపేటకు చెందిన సతీష్‌తో కలిసి భాకరాపేటకు వెళ్లారు. సాయంత్రం ముని నిరంజన్‌ను బస్సు ఎక్కించినట్లు సతీష్ చెపుతున్నాడు. అయితే ముని నిరంజన్ ఇంటికి రాకపోవడంతో తల్లి స్వాతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మఠం భూముల్లో పేదలకు ఒక న్యాయం..
పెద్దలకు ఒక న్యాయమా!



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 13 : హథీరాంజీ మఠం భూముల విషయంలో అధికారుల తీరు హాస్యాస్పదంగా ఉందని, చిన్నపాటి రేకుల షెడ్లు వేసుకున్న పేదలను ప్రశ్నిస్తున్నారే తప్పా భవంతులు కట్టుకున్న పెద్దలను ఎందుకు నిలదీయడం లేదని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మాట్లాడుతూ మఠం భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చేయమని చెప్పిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నదమ్ములే ఒకప్పుడు అవే భూములను రూ.లక్షలకు విక్రయించారనే విషయం తెలీదా అని ప్రశ్నించారు. ఇదే మఠం భూముల వెనుక ఎమ్మెల్యే చెవిరెడ్డి 30 ఎకరాల భూములను లీజుకు తీసుకున్నాడని, వాటి జోలికి పోయే ధైర్యం లేని అధికారులు పేదల ఇళ్లను కూలదోయడం నీచమైన చర్యన్నారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన దేవదాయ శాఖ ఏవో రమేష్‌నాయుడు, ఏఈవో శ్రీనివాసులరెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రెజరీ ఎదుట విశ్రాంత ఉద్యోగుల ధర్నా



పుత్తూరు, మార్చి 13: ఆదాయపు పన్ను పరిధిలోకి రాని విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ల నుంచి పుత్తూరు ఉపఖజానా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రికవరీలు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ విశ్రాంత ఉద్యోగులు బుధవారం జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపు పన్ను రికవరీ చేయడం వల్ల ఆరువందల మంది విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నవంబరు నెల నుంచే వార్షిక పించను రాబడి, పొదుపును మదింపు చేసి మూడు విడతల్లో ఆదాయపు పన్ను వసూలు చేయాల్సి వుందన్నారు. కొత్త చట్టం మేరకు ఏడున్నర లక్షల వార్షికాదాయం వరకు పన్ను మినహాయింపు వుందని, ఈ నిబంధనలను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా మదింపు వేసి, ఆరు లక్షల వార్షిక పించను వచ్చే వారికి కూడా ఫిబ్రవరి నెలలో ఒకేసారి రికవరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలకు బాధ్యులైన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతామని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి జయరాంనాయుడు, సహాయ అధ్యక్షులు యుంగధర్‌రాజు, గోపాల్, కోశాధికారి సిద్దయ్య, రాష్ట్ర మహిళా సంఘ కార్యదర్శి కృపావరమ్మ, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో వ్యవసాయ ఉత్పత్తులు

రామచంద్రాపురం, మార్చి 13: మండల ప్రజలకు అందుబాటులో ఉంచాలనే ఆలోచనతో మండలంలోని సి.రామాపురంలో నాబార్డు సౌజన్యంతో నారీ స్వచ్ఛంద సంస్థ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆ సంస్థ కార్యదర్శి రజని అన్నారు. బుధవారం నూతనంగా ఏర్పాటుచేసిన నారి రూరల్ మార్టును నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజరు సునీల్, ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం షణ్ముగం ప్రారంభించారు.ఇందులో లభ్యమయ్యే ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఏపీ మాస్ డైరెక్టర్ వినాయకరెడ్డి, ఏవో స్రవంతి, నారీ సంస్థ అధ్యక్షులుగోపాల్‌రెడ్డి, ఎఫ్‌పీవో డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించుకుందాం



ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన నాయకులు

తిరుపతి రూరల్, మార్చి 13: చంద్రగిరి నియోజకవర్గం టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి నానిని అఖండ మెజారిటీతో గెలిపించాలని తిరుపతి రూరల్ ఓటేరు గ్రామపంచాయితీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో ఓటేరు టీడీపీ అధ్యక్షులు ధర్మ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డెప్ప నాయుడు రాఘవేంద్ర, వేల్‌మురగన్, వెల్లియమ్మ, చిట్టిబాబు పాల్గొన్నారు.

స్వర్ణముఖి వద్ద డంపింగ్‌యార్డు ఎత్తివేత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]





డంపింగ్‌యార్డు స్థలాన్ని శుభ్రం చేసిన దృశ్యం(ప్రస్తుతం) - గతంలో ఇలా...

తిరుచానూరు, మార్చి 13: తిరుచానూరు శ్మశాన వాటిక సమీపంలో స్వర్ణముఖి నది వద్ద డంపింగ్‌యార్డు నుంచి వచ్చే పొగ, వ్యర్థాలతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'తిరుచానూరు ఉక్కిరి బిక్కిరి' అనే శీర్షికన కథనం వారం క్రితం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ పాలకవర్గం జనావాసాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తిరుచానూరు శివారు ప్రాంతాలకు తరలించారు. డంపింగ్‌యార్డు ఉన్న స్వర్ణముఖి తీరప్రాంతాన్ని పంచాయతీ శుభ్రం చేయించింది. జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీ పాలకవర్గం సూచనతో అధికారులు డంపింగ్‌యార్డును ఎత్తివేశారు. దీంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేశారు. శాశ్వత ప్రతిపాదికన తిరుచానూరు గ్రామ పంచాయతీకి రెండెకరాలు స్థలం కేటాయించి డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

వైసీపీ నేతల బరితెగింపు !

- వార్డు సచివాలయంలో చీరల గుట్టలు
- వలంటీర్ల ద్వారా మహిళా ఓటర్లకు పంపిణీ
- పుంగనూరులో పబ్లిక్‌గా ఎన్నికల తాయిలాలు
- కళ్లు మూసుకున్న పోలీసులు, అధికారులు



సచివాలయ ఆవరణలో పంపిణీ కోసం సిద్ధంగా ఉంచిన చీరలు

ఓటర్లను మభ్యపెట్టడానికి గోడ గడియారాలు తెచ్చి నిల్వ ఉంచారంటూ పోలీసులు సెర్చ్ వారెంటుతో సోదాలు చేశారు. పుంగనూరు పట్టణంలో, చదళ్ల సమీపం తిమ్మికృష్ణాపురంలో భారీగా గడియారాలు సీజ్ చేశారు. వీటి మధ్యలో కర్ణాటక మద్యం ఉందంటూ కేసులు పెట్టారు. తమ కార్యకర్తలకోసం గడియారాలు తెప్పించామని బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ చెప్పినా పట్టించుకోలేదు.

మరిప్పుడు, వార్డు సచివాలయంలోనే చీరలు ఉంచారు. వలంటీర్లు వచ్చి ఆటోల్లో వీటిని తీసుకెళ్లారు. పుంగనూరు పట్టణంలోని తమ పరిధిలో ఇంటింటికి చీరలు పంపిణీ చేశారు. ఇదంతా పట్టపగలు.. పబ్లిక్‌గా జరిగింది. 16వ వార్డు సచివాలయానికి సంబంధించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయినా, 'నో పోలీస్'.



చీరలు తీసుకెళ్లడానికి వార్డు సచివాలయంలో ఉన్న వలంటీర్లు

- ఓటర్లను మభ్యపెడితే సహించేది లేదని, చర్యలు చేపడతామంటూ ఫిబ్రవరి 6వ తేదీన గోడగడియారాలు సీజ్ చేసిన పోలీసులు... బుధవారానికి వచ్చేసరికి సైలెంట్ అయిపోయారు. ఎందుకంటే.. ఆ గడియారాలు బీసీవైపార్టీవి. ఇప్పుడు చీరలు పంచింది అధికారపార్టీ. పోలీసుల దృష్టిలో 'బోత్ ఆర్ నాట్ సేమ్' మరి.

అది పుంగనూరు పట్టణం కొత్తపేటలోని 16వ వార్డు సచివాలయం. కార్యాలయంలోపల చీరల గుట్టలున్నాయి. దీనిని బట్టల షాపుగా మార్చేశారు. బుధవారం ఒక్కొక్కరుగా వలంటీర్లు అక్కడికి వస్తున్నారు. వచ్చిన వారందరికీ పదుల సంఖ్యలో చీరలు ఇస్తున్నారు. ఈ చీరలను మోసుకొంటూ వచ్చి సచివాలయం బయట పెట్టారు కొందరు వలంటీర్లు. ఆపై ఆటోలు పిలిపించి తమ ప్రాంతాలకు తీసుకెళ్లారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలతో ఉన్న సంచుల్లో చీరలు పెట్టి తమ పరిధిలోని ఓటర్లకు వలంటీర్ల ద్వారా అందజేశారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుందన్న ప్రచారం నేపథ్యంలో పుంగనూరు పట్టణంలో అధికార వైసీపీ నేతలు ఓటర్లకు పబ్లిక్‌గా తాయిలాలు అందజేశారు. పుంగనూరులో సీఐ, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, సచివాలయ పోలీసులు, ఎన్నికల తాయిలాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ తదితర శాఖల అధికారులు కళ్లు, చెవులు మూసుకుని గాఢనిద్ర నటించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు యథేచ్ఛగా చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. దీనికి ప్రజల మధ్యన ఉండే సచివాలయాలనే పంపిణీ కేంద్రాలుగా ఎంచుకున్నారు. తమను అడిగేదెవరని ఇలా బరితెగించారు. వీటిని మహిళా ఓటర్లకు చేర్చే బాధ్యతను నేతలు వలంటీర్లకు అప్పగించారు.

పెద్దాయన ఇవ్వమన్నారంటూ..

సచివాలయాల నుంచి వలంటీర్లు చీరలు, బ్యాగులు తీసుకెళ్లడం పట్టణమంతా వ్యాపించింది. 16వ వార్డు సచివాలయం వద్ద ఎస్డీపీఐ నాయకులు వీడియో తీశారు. వలంటీర్లను ప్రశ్నించారు. పెద్దాయన ఇవ్వమన్నారని కొందరు.. మీకెందుకు చెప్పాలని ఇంకొందరు.. మమ్మల్ని ప్రశ్నించేందుకు మీరెవరని మరికొందరు వారిని నిలదీశారు. కాగా, చీరల పంపిణీ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయినా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వ అధికారులు, పుంగనూరు సీఐ రాఘవరెడ్డి కనుసన్నల్లో పుంగనూరులో వైసీపీ చీరలు పంపిణీ చేసిందని కేంద్ర ఎన్నికల సంఘానికి బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్.. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.

కొసమెరుపు: వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని చీరలు ఇస్తున్నారు సరే. డబ్బులు ఎప్పుడు ఇస్తారని కొందరు ఓటర్లు వలంటీర్లను ప్రశ్నించినట్లు తెలిసింది.

- పుంగనూరు

ఆ చీరలు మావే

- 2020లో పోలీసులు సీజ్ చేసిన వాటిని వైసీపీ పంచుతోంది
- రామచంద్రయాదవ్ ఆగ్రహం

పుంగనూరు, మార్చి 13: పుంగనూరులో వైసీపీ తరఫున పంచిన చీరలు నాలుగేళ్ల కిందట సీజ్‌చేసిన తమవని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. 2020 జనవరిలో నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి కానుకగా చీరలు, క్యాలెండర్ కిట్లు ఇవ్వడానికి బిల్లులు, పన్నులు చెల్లించి నేను తీసుకొచ్చా. అప్పటి పోలీసు అధికారులు అన్యాయంగా చీరలమాటున మద్యం బాటిళ్లు పెట్టారు. నన్ను రాజకీయంగా అడ్డుకొని మంత్రికి ఊడిగం చేయడానికి 50 వేల చీరలను సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్లలో ఉండాల్సిన ఆ చీరలను కొందరు చెంచా పోలీసుల ద్వారా వైసీపీ నాయకులకు అందజేసి వాటిని పంపిణీ చేయడం సిగ్గుచేటు. ఆ చీరలకు సంబంధించి అన్ని బ్యాచ్ నెంబర్లు, బిల్లులు నా వద్ద ఉన్నాయి' అని చెప్పారు. తమ చీరలను పోలీసుల ద్వారా తీసుకుని వైసీపీ నాయకులు సిగ్గులేకుండా మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఫొటోలతో ఉన్న బ్యాగుల్లో పెట్టి వలంటీర్ల ద్వారా పంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. వందశాతం తాను తెప్పించిన చీరలను వైసీపీ పంపిణీ చేస్తుంటే ఎస్పీ, పోలీసు అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. తమ స్థాయిని దిగజార్చి అక్రమాలు, నీచమైన పనులకు పాల్పడుతున్న కొందరు పోలీసు అధికారులు రానున్న రోజుల్లో సమాధానం చెప్పకతప్పదని హెచ్చరించారు.







లారీ ఢీకొని నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

- తప్పిన పెనుప్రమాదం

తిరుపతి రూరల్, మార్చి 13: డీఆర్ మహల్ రోడ్డులో ఉన్న టీటీడీ రెండవ సత్రం నిర్మాణ పనులకు ఇనుపరాడ్స్ తీసుకొస్తున్న భారీ లారీ ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం నేలకొరిగిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచి డీఆర్ మహల్‌కు వెళ్లే మార్గంలో టీపీఎస్ సర్కిల్ వద్ద ఉన్న విద్యుత్ లైన్లు లారీకి తగిలి కూలిపోయాయి. అటువైపు నుంచి వస్తున్న వాహన చోదకులు ప్రమాదాన్ని గుర్తించి అప్రమత్తమవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను పక్కకు తొలగించారు. ప్రమాదాన్ని నియంత్రించేందుకు ఫైరింజన్ అక్కడికి చేరుకుంది. ఎటువంటి ప్రమాదమూ జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మొల్ల జయంతి



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ - పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్)/(నేరవిభాగం)/అర్బన్/కల్చరల్, మార్చి 13 : కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆమె చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా ఆమెపేరు ప్రఖ్యాతలు సాధించినట్లు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పుష్పాంజలి ఘటించారు. మొల్లమాంబ సరళమైన, రమణీయమైన శైలిలో రామాయణం రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. టీడీపీ బీసీ శాలివాహన తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు ఆముదాల తులసీదాస్ ఆధ్వర్యంలో మహతి ఆడిటోరియం వెనుక వైపునున్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రాయలసీమ రంగస్థల చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మొల్లమాంబకు నివాళి అర్పించారు.

ఉప్పరపాళెంలో నీటి ఎద్దడి

బోరు మరమ్మతుకు గురికావడంతో అవస్థలు ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులపై స్థానికుల ఆగ్రహం


మరమ్మతులకు గురైన బోరు

మంగళం, మార్చి 13: తిరుపతి అర్బన్ పరిధిలోని ఉప్పరపాళెంలో తాగునీటి సమస్య నెలకొంది. ఉన్న ఒక్క బోరు నుంచి ట్యాంకుకు నీరు తోలి సరఫరా చేసేవారు. రెండు నెలల క్రితం మోటారు మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో..ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. స్థానికంగా ఉంటున్న దాదాపు 180 కుటుంబాల వారు రోజుమార్చి రోజు రూ.400 చెల్లించి ట్యాంకరు ద్వారా నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ట్యాంకరు తెప్పించుకోలేని వారు వాటర్ క్యాన్లు కొనుక్కుంటున్నారు. సమస్య పరిష్కరించకపోతే కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు



బోరు మరమ్మతులకు గురైందని నగరపాలక సంస్థ అధికారులకు ఎన్నిసార్లు చెప్పాలి. రెండు రోజులకొకసారి వాటర్ ట్యాంకర్ తెచ్చుకోవాలంటే డబ్బులు ఎవరిస్తారు. కనీసం అధికారులు వాటర్ ట్యాంకులు కూడా పంపించడంలేదు. వెంటనే బోరు రిపేర్ చేయించాలి. - వెన్నెల

పంచాయతీలో ఉన్నపుడే బాగుంది



ఉప్పరపాళెం శెట్టిపల్లి పంచాయతీలో ఉన్నపుడే బాగుంది. చిన్న సమస్య ఉన్నా వెంటనే వచ్చి పరిష్కరించేవారు. కార్పొరేషన్‌లో కలిపారని గొప్పగా చెబుతున్నారు. కానీ ఒక పని జరగడంలేదు. బోరు మోటారు రిపేర్ అయిందని చెబుతుంటే ఇప్పటివరకు చేయలేదు. తెలుగుగంగ పైపులైను కూడా అరకొరగా వేసి వదిలేశారు. - సుశీలమ్మ

బోరు బాగు చేయకపోతే రోడ్డుపైకి వస్తాం..



14 రోజులుగా చెబుతున్నా ఇంత వరకు బోరు బాగు చేయలేదు. నీరు లేకుండా కార్పొరేషన్ అధికారులు ఒక రోజైనా ఉండగలరా.. ఎండా కాలంలో తాగడానికి నీళ్లు లేకుంటే ఎలా బతకాలి. అధికారులు పట్టించుకోకపోతే ఖాళీ బిందెలతో రోడ్డుమీదకు వచ్చి కూర్చుంటాం. - కాంచనమ్మ

రీసెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి


టీసీఎస్ ప్రతినిధులతో రీసెట్ కన్వీనర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 : ఏపీ ఆన్‌లైన్, టీసీఎస్ ప్రతినిధులతో ఏపీ రీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు సమావేశమయ్యారు. టీసీఎస్ ప్రతినిధులతో కలిసి తొలుత వర్సిటీ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ హుస్సేన్‌తో కలిశారు. అనంతరం టీసీఎస్ సీనియర్ మేనేజర్ శేషుకుమార్, ఇతర ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఏడేళ్లుగా రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రవేశ పరీక్షలను టీసీఎస్, ఐయాన్ సంయుక్తంగా పూర్తి చేశాయన్నారు. ఈ దఫా కూడా రీసెట్‌ను ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించాలని సూచించారు. శేషుకుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రీసెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీసీఎస్ ఐయాన్ మేనేజర్ శారద మాట్లాడుతూ హాల్ టికెట్ల జారీ నుంచి ఫలితాల వెల్లడి దాకా అత్యంత పారదర్శకంగా చేపడతామన్నారు. ఈ దఫా 60 శాతం ఫేస్ రికగ్నేషన్ మ్యాచ్ అయితేనే పరీక్షలకు అనుమతిస్తామన్నారు. ఈ సమావేశంలో పీజీఈసెట్ కన్వీనర్ రమాశ్రీ, టీసీఎస్ ప్రతినిధులు, రీసెట్ సిబ్బంది చంద్రశేఖర్, కామేష్, నాగభూషణం, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రీపోల్‌కు అవకాశం లేని ఎన్నికలు నిర్వహించాలి

సీఈవో ముఖేస్‌కుమార్ మీనా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 13 : ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా, రీపోల్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. విజయవాడ నుంచి ఆయన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సంబంధిత ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ క్లైమ్స్ త్వరితగతిన నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ నుంచి నగదు చెల్లింపు వార్తలు, రాజకీయ ప్రకటనలపై నివేదిక అందజేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో ఆదితిసింగ్, అదనపు ఎస్పీ వెంకట్రావు, డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని రాజధాని చేసి చేసి తీరుతా : చింతా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 13 : రాయలసీమ ప్రజల అభివృద్ధి జరగాలంటే తిరుపతి రాజధాని కావాల్సిందేనని, మోడీ, జగన్, చంద్రబాబు లాంటి వాళ్లు ఎంతమంది అడ్డువచ్చినా తప్పక చేసి తీరుతానని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తిరుపతిని రాజధానిగా చేసి హైదరాబాద్ కంటే దీటుగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుంచి ఒత్తిళ్లు వచ్చాయన్నారు. ఈ విషయంపై 2011లోనే అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నుంచి ప్రతిపాదనలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేద కుటుంబానికీ నెలకు రూ.5 వేలు తప్పక ఇస్తామన్నారు. అనంతరం రాజధాని తిరుపతి అంటూ నినాదాలు చేశారు.

ఇంటర్ పరీక్షలకు 832మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 13: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు బుధవారం జిల్లాలో 832మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో 29,002మందికిగాను 28,170మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. జనరల్‌లో 27,851 మందికిగాను 27,094, ఒకేషనల్‌లో 1,151మందికిగాను 1,076మంది పరీక్ష రాశారని వెల్లడించారు.

ఆర్టీసీలో పారిశుధ్య పనులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 13: జిల్లా పరిధిలోని ఆర్టీసీ డిపోలలో పారిశుధ్య పనులకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆయా డిపో మేనేజర్ కార్యాలయంలో లభిస్తాయని, ఆసక్తిగలవారు ఈనెల 15లోపు దరఖాస్తులను ప్రజారవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 7382881717ను సంప్రదించాలని కోరారు.

హ్యూమన్‌రైట్స్, యాంటీ కరెప్షన్ సెల్ నగర కమిటీ ఎంపిక


నియామక పత్రం అందుకుంటున్న వినయ్‌రెడ్డి

తిరుపతి అర్బన్, మార్చి 13: ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ నగర కమిటీని ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి, ప్రధాన కార్యదర్శి పి.రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.నరసింహారెడ్డి, జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా ఎస్.వినయ్‌రెడ్డి నియమితులయ్యారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మానవహక్కుల గురించి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. కమిషన్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

టీటీడీ పెన్షనర్లకు స్థలాల కేటాయింపుపై హర్షం

తిరుపతి అర్బన్, మార్చి 13: టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాల కేటాయింపుపై టీటీడీ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇంటి స్థలాలు రాని వారికి త్వరలోనే ఇస్తామని హామీ ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు.

మహిళపై దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13 : మహిళపై దాడి చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు కథనం మేరకు.. తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతం నగర్‌కు చెందిన ధనలక్ష్మిపై భూ తగాదాల నేపథ్యంలో ఫిబ్రవరి 19న తాటితోపునకు చెందిన ఎం.జ్యోతీశ్వర్‌నాయుడు, అతని కుమారుడు భరత్ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు వారిద్దరిని అరెస్టు చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు. వారు ఇప్పటికే పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మురళీరెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13: వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.మురళీరెడ్డి నియమితులయ్యారు. బుధవారం ఏర్పాటైన యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో మురళీరెడ్డి స్థానం సంపాదించుకున్నారు. గతంలో వైఎస్సార్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా మురళీరెడ్డి పనిచేశారు. ఈ సందర్భంగా మురళీరెడ్డిని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు అభినందించారు.

స్పా సెంటర్‌లో తనిఖీలు

తిరుపతి(నేర విభాగం), మార్చి 13: ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సి7సెలూన్ స్పాసెంటర్‌లో పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. మసాజ్ ముసుగులో ఉత్తరాది యువతులతో వ్యభిచారం సాగిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి, నిర్వాహకులు ఎవరన్న కోణంలో ఈస్ట్ ఎస్సై లావణ్య దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలిచ్చే దశకు యువతను చేరుస్తాం

బీసీలకు విద్య, సామాజిక, ఆర్థిక కల్పనే లక్ష్యం - కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ప్రధాని మోదీ


లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 : దేశంలో యువత ఉద్యోగాలు చేసే దశ నుంచి ఉద్యోగాలు ఇచ్చే దశకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పీఎం-సూరజ్ జాతీయ పోర్టల్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ నుంచి లబ్ధిదారులు ప్రధాని ప్రసంగం విన్నారు. అట్టడుగు, బలహీన వర్గాలకు విద్య, సామాజిక, ఆర్థిక సదుపాయాల కల్పన, పునరావాసం కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. సూరజ్ పోర్టల్ ద్వారా రుణాలను సులువుగా పొందడానికి అవకాశముందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బలహీన వర్గాలకు చెందిన లక్షమంది పారిశ్రామికవేత్తలకు క్రెడిట్ సపోర్టు మంజూరు కోసం ఈ పోర్టల్ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముద్ర రుణాలు, స్టాండప్ ఇండియా పథకాల ద్వారా యువత అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే) కింద సఫాయి, మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోతిరుపతి నగరపాలక కమిషనర్ అదితి సింగ్, డీఆర్వో పెంచల్ కిషోర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ యు.నరసింహులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కరరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ పాల్గొన్నారు.

నూతన రహదారి భద్రతా బిల్లును రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఆటో, ట్యాక్సీ కార్మికులు

తిరుపతి (రవాణా), మార్చి 13 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రహదారి భద్రతా బిల్లును వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. రహదారి భద్రత బిల్లును రద్దు చేయాలని కోరుతూ జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో, ట్యాక్సీ కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో కార్మిక వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. రహదారి భద్రతా బిల్లు అమలు వల్ల రవాణా రంగంపై ఆధారపడ్డ లక్షలాది మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 21, 31జీవోల వల్ల అపరాధ రుసుంలు 200 శాతం పెరిగాయని తెలిపారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని, వాహనాల మరమ్మతుల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని అన్నారు. ఈ జీవోలను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు ఆర్టీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. శివ, పురుషోత్తంరెడ్డి, ఎం.శివ, సురేష్, వెంకటేష్, శ్రీనివాసులు, అల్లాబక్షు, కిషోర్, మహేంద్ర, కృష్ణ, సతీష్, ఆనంద్, శ్రీధర్, పార్వతి, కుమార్, ప్రమీల, కుమారి, ఎలికే నాయుడు, బాల, రమేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం


ఓటు హక్కు అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 13: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సీఈవో అనుమతించిన ఓటరు జాబితా నుంచి గూడూరు 538, సూళ్లూరుపేట 605, వెంకటగిరి 744, చంద్రగిరి 1,680, తిరుపతి 856, శ్రీకాళహస్తి 571, సత్యవేడు 76 తొలగింపులకు అనుమతి వచ్చిందని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక అనుసరించాలని సూచించారు. ఈవీఎంలపై ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. వాటి రవాణాలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి పోలీసు అధికారులకు సూచనలు చేశామన్నారు. డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 15 నుంచి 2024 మార్చి 11 నాటికి ఫారం 6, 7, 8కు సంబంధించి 11,516 పెండింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈఆర్వోలు ఆదితిసింగ్, చంద్రముని, నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గీతాంజలి చావును రాజకీయానికి వాడుకోవడం బాధాకరం

● **తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రవినాయుడు**


మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 13 : తండ్రి చావుతో రాజకీయం మొదలు పెట్టిన సీఎం జగన్ బాబాయి చావుతో అధికారంలోకి వచ్చాడని, ఇప్పుడు గీతాంజలి చావును అడ్డుపెట్టుకుని మళ్లీ అధికారంలోకి రావాలని ప్రయత్నం చేయడం సిగ్గుచేటని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. వైసీపీ సోషల్ మీడియాలో చేసిన పోస్టులే గీతాంజలి చావుకు కారణమని ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగిస్తే గీతాంజలి చావుకు కారకులు ఎవరనే విషయం బయటకు వస్తుందన్నారు. యువత కల.. నా కల అంటూ జగన్ ప్రచారం చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన్ను ఇంటికి పంపించేందుకు యువత సిద్ధంగా ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, విదేశీ విద్యను పూర్తిగా నిలిపేసి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని దుయ్యబట్టారు. తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు, తోటవాసు, కార్యదర్శి ఆర్సీ శ్రీనివాసులు, నియోజవర్గ అధ్యక్షుడు కర్లం సందీప్, నేతలు తోట వాసు, శ్రీనివాస్ యాదవ్, రఫీ, శ్రీరామ్ బాబీ, దిలీప్‌రాయల్, లోకేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర విద్యార్థులతో కలెక్టర్ సమావేశం


కలెక్టరేట్‌కు వచ్చిన త్రిపుర విద్యార్థులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 13: త్రిపుర నుంచి వచ్చిన 45మంది విద్యార్థుల బృందంతో కలెక్టర్ లక్ష్మీశ బుధవారం సమావేశమయ్యారు. ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విభిన్న సంస్కృతి, సంప్రదాయాలను, ఇతర విషయాలను తెలుసుకోవడానికి వచ్చిన విద్యార్థులతో ఆయన చాలా విషయాల గురించి చర్చించారు. ఇలాంటి కార్యక్రమాలు దేశ ఐక్యతను, సమగ్రతను బలోపేతం చేస్తాయన్నారు. తిరుపతి జిల్లాలోని పలు విశేషాలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు వసుధారాణి దేవనాథన్, ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లి, శివకుమార్‌కునా, హిమాన్ష్ శేఖర్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిరంతర కృషి : ఎమ్మెల్యే


రోడ్డు మార్గాన్ని ప్రారంభిస్తున్న కరుణాకరరెడ్డి

తిరుపతి అర్బన్, మార్చి 13: నగరాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటామని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. రూ.20కోట్లతో నిర్మించిన గోదాదేవి, కులశేఖర ఆళ్వార్ మాస్టర్‌ప్లాన్ రోడ్లను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అంతకుముందు నేతాజీ సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు విగ్రహాలను, సెంట్రల్ లైటింగ్‌ను, సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మనం తిరుగుతున్న ఊరికి మంచి చేయాలనే తపనతో శ్రమిస్తున్న అభినయ్‌ను ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్, శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి, ఉపమేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారా మిలటరీ దళాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ దళాలు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 13 : కేంద్ర పారా మిలటరీ బలగాలు బుధవారం ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి నేతృత్వంలో సీఐ మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో చేతిలో పిస్టళ్లు, తుపాకులు, ఏకే 47 గన్‌లు చేతపట్టుకుని డీబీఆర్ ఆస్పత్రి రోడ్డు నుంచి సంజయ్ గాంధీ కాలనీ, నలందా స్కూల్, అశోక్‌నగర్, లీలామహల్ సర్కిల్, స్కావెంజర్స్ కాలనీ, మున్సిపల్ ఆఫీస్ వరకు నిర్వహించారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో భరోసా కల్పిస్తున్నామన్నారు. అనుమానితులు, సంఘవిద్రోహ శక్తులు కనిపిస్తే వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని కోరారు. లీలామహల్ సర్కిల్, స్కావెంజర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈస్ట్ ఎస్ఐలు లావణ్య, శ్రీకాంత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మునిరాజు, బీఎస్ఎఫ్ దళాలు పాల్గొన్నాయి.

ఇంజనీర్ల సమస్యలపై స్పందించండి


సంతోషరావుతో అసోసియేషన్ నేతలు

తిరుపతి సెంట్రల్, మార్చి 13: ఏపీ సదరన్ డిస్కం పరిధిలోని ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు బుధవారం సంస్థ సీఎండీ కె.సంతోషరావును కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. సీఎండీ మాట్లాడుతూ సంస్థ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం నాయకులు పి.బాలాజీ, యు.రమేష్, మాధవరావు, భాస్కర్‌నాయుడు, గంగాధర్‌రెడ్డి, జయప్రకాష్, వేణుగోపాల్, సి.బాలాజీ, మునిప్రసాద్, స్వాతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.43 కోట్లు

తిరుమల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.43 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 60,110 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,445 మంది తలనీలాలు సమర్పించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించండి: పాశం



కరపత్రాలను అందజేస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 13: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మంగళపూరు గ్రామంలో శంఖారావం- సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని దోచుకుంటోందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోసం చేసిందని, అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి దౌర్జనాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వైసీపీని గద్దె దించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ మహాకూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధురెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, పరంధామరెడ్డి, అమరేంద్ర, పెంచలయ్య, సురేంద్ర, కోటేశ్వరరావు, పాపయ్య, నరేంద్ర, గురవయ్య పాల్గొన్నారు.

మహాకూటమిని గెలిపించండి



అభివాదం చేస్తున్న బీజేవైఎం నాయకులు

గూడూరు, మార్చి 13: రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన మహాకూటమిని గెలిపించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీజేవైఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న రాక్షసపాలనను అంతమొందించేందుకు మహాకూటమిగా ఏర్పడి పోటీచేయడం జరుగుతోందన్నారు. ఈమహాకూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో శివశంకర్, సుధాకర్‌రాజు, కమల్, నవీన్, కిరణ్, మహేష్, శశి, ప్రదీప్, ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న సీఐ పాపారావు, ఉపాధ్యాయులు

గూడూరు, మార్చి 13: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని పట్టణ సీఐ పాపారావు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ముందుకు వచ్చి మండలంలోని 5 జిల్లా ఉన్నత పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులను దత్తత తీసుకుని వారికి క్రీడాదుస్తులు, పరికరాలు అందజేసి క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, కరిముల్లాఖాన్, హెచ్ఎం భారతి, పీడీ శివకుమార్, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, రమేష్, కల్పన, భాస్కర్, సంస్థ సభ్యులు సుమంత్, హరికృష్ణ, లత, మౌనేంద్ర, ఎలీషాబాబు పాల్గొన్నారు.

జూన్ నెల రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల కోటా 25న విడుదల

● 18, 21 తేదీల్లో శ్రీవారి ఆర్జిత సేవల కేటాయింపు

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి జూన్ నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు. ఇదే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోసం భక్తులు ఈనెల 18వ తేదీ ఉదయం 10 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సేవలకు ఎంపికైన భక్తులు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుం ది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్స వం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న జ్యేష్ఠాభిషేక ఉత్సవాల్లో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంచుతారు.అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణిట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటా ను విడదల చేస్తారు. మార్చి25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిల్లోని శ్రీవారి సేవా కోటాను, అదేరోజు మధ్యా హ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను,ఒంటి గంటకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

చెట్టును ఢీకొన్న బైక్
యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని భరత్‌నగర్‌లో చెట్టును మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని బిరదవాడ గ్రామానికి చెందిన చైతన్య(21) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తుమ్మూరులో ఉన్న కారును తీసుకువచ్చేందుకు మోటారు సైకిల్‌పై బిరదవాడ నుంచి బయలుదేరాడు. మార్గ మధ్యలో భరత్‌నగర్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఓ శీతల పానియాల దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 3 ఫుల్‌బాటిళ్లు, 4 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని ఎస్‌ఐ గోపి స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైకిల్ జోరు... ఫ్యాన్ బేజారు

● టీడీపీలో చల్లారిన అసమ్మతి
● వైసీపీలో రగిలిపోతున్న నాయకులు

తడ, మార్చి 13: మరి కొద్దిరోజుల్లో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. టీడీపీ ప్రచారంలో జోరుగా దూసుకుపోతుంటే వైసీపీ మాత్రం ప్రచారం మొదలుపెట్టలేక బేజారుగా కనబడుతుంది. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో పార్టీ ఓటమితో శ్రేణులు డీలాపడిపోయాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు దగ్గరపడటంతో టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. ప్రముఖ పారిశ్రామికవేత్త టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన నాయకులను సమన్వయం పరిచే పనిలోపడ్డారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ నెలవల విజయశ్రీని అధిష్ఠానం రంగంలోకి దింపింది. దీంతో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డితో పాటు ఇతర నాయకులు ఒక్కతాటిపైకి తీసుకువచ్చారు.

చేరికలతో దూకుడుగా టీడీపీ

వైసీపీలోని అసమ్మతి నాయకులైన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కట్టా రమణారెడ్డి తదితరులు టీడీపీలో చేరి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. మరికొంతమంది వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో ఉన్న అసమ్మతి నేతలను సైతం టీడీపీ అధిష్ఠానం సమన్వయపరిచింది. అందరూ కలసికట్టుగా ప్రజల్లోకి వెళుతుండడంతో నియోజకవర్గం మొత్తం ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. గ్రూపు రాజకీయాలతో ఇన్నాళ్లు ఇబ్బందులు పడ్డ నాయకులంతా కలసికట్టుగా ప్రచారం సాగిస్తుండటంతో క్యాడర్‌లో సైతం ఉత్సాహం నెలకొంది.

వెనుకబడ్డ వైసీపీ

ఇక అధికార వైసీపీ ప్రచారంలో వెనుకబడిపోయింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో అధిష్ఠానం ఇప్పటి వరకు తేల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మరోమారు టిక్కెట్‌ను కేటాయిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రకటనలు చేయడం తప్ప అధిష్ఠానం నుంచి స్పష్టత రాలేదు. దీంతో పాటు వైసీపీలోని గ్రూపు తగాదాలు పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కిలివేటికి టికెట్ కేటాయిస్తే ఓడించి తీరుతామని కొంతమంది బాహాటంగానే ప్రకటించడం తలనొప్పిగా మారింది. కొంత మంది వైసీపీని వీడి టీడీపీలో చేరిపోవడం, మరి కొంత మంది అదేదారిలో ఉన్నట్లు తెలియడంతో అధిష్ఠానం అప్రమత్తమై అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా, అసమ్మతి నేత, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి మంగళవారం సీఎం జగన్‌ను కలిశారు. వైసీపీ గెలుపు కోసం పనిచేస్తామని హామీ ఇచ్చినట్లుగా సమాచారం.

వైసీపీది ధన బలం... టీడీపీది ప్రజా బలం: నెలవల



ప్రచార కరపత్రాలు అందజేస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, మార్చి 13: టీడీపీకి కార్యకర్తలు, ప్రజలే బలమని, ప్రజా బలంతో అధికార పార్టీ ధనబలం కొట్టుకుపోవడం ఖాయమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం పట్టణంలోని కసారెడ్డిపాలెంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని వినాయకుడి గుడి వద్ద పూజలు చేశారు. అనంతరం ఇంటింటా తిరిగి టీడీపీకి ఓటువేయాలని అభ్యర్థిస్తూ ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన వైసీపీ ధనబలం, దౌర్జన్యాలతో అధికారం దక్కించుకోవాలని పగటి కలలు కంటోందన్నారు. చంద్రబాబునాయుడికి వచ్చే ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. కక్ష్య సాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజాకోర్టులో వైసీపీకి శిక్ష తప్పదని హెచ్చరించారు. బీసీలు, ఎస్సీలపై కూడా అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు, నూలేటి రమణయ్య, బండారు ఆంజనేయులు, గంపల రవి, బుజ్జిబాబు, పెంచలయ్య, శ్రీధర్, మోహన్, పొన్నా కాటయ్య, మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వైసీపీ నేతలతో కలిసి నేదురుమల్లి జనార్దన రెడ్డి విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి - ట్రాఫిక్ జామ్‌తో 108 వాహనానికి తప్పనితిప్పలు

నేదురుమల్లి విగ్రహావిష్కరణ

వాకాడు, మార్చి 13: వాకాడు స్వర్ణముఖినది ఒడ్డున మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. నేదురుమల్లి తనయుడు, జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, వైసీపీ నేతలు యల్లసిరి గోపాల రెడ్డి, దేవసేనమ్మ, సత్యనారాయణ, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తరలించిన జనం మధ్యలోనే ఒక్కసారిగా బయల్దేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.చివనకు 108 వాహనానికి దారిలేక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: కురుగొండ్ల



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, మార్చి13: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నిండలి, వాక్యం గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిండలి గ్రామస్థులు మాట్లాడుతూ పంటల సాగుకు అనువుగా లేని పొలాలకు మట్టి తోలుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. బాత్‌రూమ్ నిర్మించుకోవడానికి ఇసుక తోలుకునేందుకు కూడా అనుమతి తీసుకోవాల్సి రావడంతో అవస్థలు పడుతున్నామని కురుగొండ్ల దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు మట్టి తోలుకునేలా చర్యలు తీసుకుంటామని కురుగొండ్ల హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, సీసీ నాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, కొమ్మి గెరటయ్య నాయుడు, వల్లిపి ఈశ్వర్, గోపాల్ రాజు, బీజేపీ నేత సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న మధు రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 13: వ్యవసాయ మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగి శంకరయ్య కుటుంబానికి శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మధు రెడ్డి రూ. 25 వేల ఆర్థిక సహాయం చేశారు. శ్రీకాళహస్తి మండలం అరవ కొత్తూరుకు చెందిన శంకరయ్య అనే వ్యవసాయ మార్కెట్ కమిటీ రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో మంగళవారం రాత్రి ఇంటి వద్ద మృతి చెందారు. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మధు రెడ్డి బుధవారం మృతదేహానికి నివాళులర్పించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుని భార్య మస్తానమ్మకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇమ్రాన్, సుబ్రమణ్యం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 13: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక కోనేటిమిట్ట ప్రాంతంలో భవిష్యత్తుకు ష్యూరిటీ - బాబు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను అందజేసేలా చంద్రబాబునాయుడు మినీమెనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పిళ్లెల శ్రీనివాసులు, పేటేటి వెంకటేశ్వర్లు, పేటేటి ప్రకాష్ రావు, పిళ్లెల శ్రీదేవి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, చిరంజీవి, నాగేంద్ర, సన్నీ, తేజ, అశోక్, శ్రీకాంత్, కార్తీక్, కుమార్, లక్ష్మీనారాయణ, వాటంబేడు శివకుమార్, జనార్ధనరెడ్డి, సుబ్బయ్య, ఇంద్రవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, మార్చి 13: చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ డిజిటల్ ప్రచార రథం ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 18: బీజేపీ డిజిటల్ ప్రచార రథాన్ని బుధవారం ఆపార్టీ నాయకులు పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కంద్రిగ ఉమా, గరికపాటి రమేష్ బాబు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తడ, మార్చి 13: ఇంటికి తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. మండల పరిధిలోని కారూరుమిట్ట గ్రామానికి చెందిన రాచపాళెం సుధాకర్ కుటుంబం సోమవారం రాత్రికి తమిళనాడులోని విల్లుపురం గ్రామానికి బయలుదేరి వెళ్లారు. మంగళవారం రాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 11సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో కుక్కలు విపరీతంగా అరుస్తుండడంతో చుట్టుపక్కలవారు మేలుకొని పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం తెల్లవారుజామున సుధాకర్ ఇంటికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ
ఐదుగురికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని తుమ్మూరు ఇందిరాకాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఇందిరాకాలనీలో నివాసం ఉంటున్న శ్రీలక్ష్మి స్థలంలో కిరణ్ తన ట్రాక్టర్ ట్రక్కును పార్కింగ్ చేశాడు. ట్రక్కును అక్కడ నుంచి తీసివేయాలంటూ కిరణ్‌కు శ్రీలక్ష్మి చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరి బంధువులు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. అఖిల్, మురళీ, కిరణ్, శ్రీలక్ష్మి, పోలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టీడీపీ నేతలు

కోట, మార్చి 13: కోట మండలానికి చెందిన టీడీపీ నేతలు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం కలిశారు. తిరుపతి పార్లమెంటు కార్యదర్శులు వాకా విజయభాస్కర్‌రెడ్డి, మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్ ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కలిసి మండలంలో సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

ఉచిత రక్త పరీక్షలు



నిరాశ్రయ గృహంలో ల్యాబ్ టెక్నీషియన్లు

శ్రీకాళహస్తి, మార్చి 13: మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయ వసతి గృహంలో బుధవారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ డే పురస్కరించుకుని శ్రీకాళహస్తి ల్యాబ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. అలాగే వసతి గృహానికి గ్లూకోమీటర్ వితరణగా అందించారు. కార్యక్రమంలో ల్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళి నాయుడు, యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆదుకోండి సారూ..

వరదయ్యపాళెం, మార్చి 13: మండలంలోని సీఎల్ఎన్‌పల్లె పంచాయతీ తూర్పు హరిజనవాడలో మంగళవారం పోలమ్మ,మునస్వామిలకు చెందిన ఇల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. బుధవారం బాధితులు మాట్లాడుతూ తమ తాటాకుల ఇల్లు పూర్తిగా దగ్ధమై, సుమారు రూ.లక్ష మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. తమ మనవడి ఆస్పత్రి ఖర్చులకోసం అప్పుచేసి తెచ్చిన సొమ్ము రూ.60 వేలు కూడా కాలిపోయిందని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

జగన్‌తో మంత్రి రోజా భేటీ



పుత్తూరు అర్బన్, మార్చి 13: మంత్రి రోజాకు వైసీపీ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో బుధవారం మధ్యాహ్నం హుటాహుటిన తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. నగరి నుంచి రెండు దఫాలు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన రోజా, ఈసారి కూడా నగరి నుంచే తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు గట్టి పట్టుదలతో ఉన్నారు. అందుకు తగ్గట్టుగా ఎన్నికల సన్నాహాలను ప్రారంభించేసింది. వరుస పెట్టి తాయిలాలు అందిస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రి రోజాకు అభ్యర్థిత్వం ఇస్తే ఆమెను ఓడిస్తామని ఇటీవల అసమ్మతి నాయకులు భీష్మ ప్రతిజ్ఞ చేసుకుని కూర్చొన్నారు. ఈ నేపథ్యంలో ఒక్క రోజాని మాత్రమే అధిష్ఠానం పిలవడంపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అభ్యర్థిత్వంపై వైసీపీ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన జారీ కాకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది.మరోవైపు టీడీపీ అధినాయకత్వం ఈ దఫా ముందుగానే అభ్యర్థిని ఖరారు చేశారు. నగరి నుంచి గాలి భానుప్రకాష్ అభ్యర్థిత్వం ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు ప్రచార పర్వంలో దూసుకెళుతున్నాయి. ఈ మొత్తం పరిణామాలను రాజకీయ వర్గాలతో పాటు మంత్రి రోజా ప్రత్యర్థి వర్గం ఆసక్తిగా గమనిస్తూ, ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేసుకుంటున్నారు. అధిష్ఠానం అధికారిక ప్రకటన చేసిన తరువాతే వైసీపీలో నెలకొన్న స్తబ్దత వీడనుంది.

పుత్తూరు వార్తలు

సదాశివకోన ఆలయ ఆదాయం రూ.12.36 లక్షలు

వడమాలపేట, మార్చి 13: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సదాశివకోనకు రూ.12,36,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తలనీలాల వేలం ద్వారా రూ.1,73,000, ప్రత్యేక దర్శనం, సర్వ దర్శనం, అభిషేకం సేవా టికెట్లు ద్వారా రూ.1,97,000, సదాశివకోన, అమ్మవారి కోనల్లో హుండీల ద్వారా రూ.8,66,000 వచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఈవో రామచంద్రారెడ్డి, ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం నాయుడు, బోర్డు సభ్యులు గోపీరమణ, వాసుదేవ రెడ్డి, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ట్రెజరీ ఎదుట విశ్రాంత ఉద్యోగుల ధర్నా



జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పుత్తూరు, మార్చి 13: ఆదాయపు పన్ను పరిధిలోకి రాని విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ల నుంచి పుత్తూరు ఉపఖజానా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రికవరీలు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ విశ్రాంత ఉద్యోగులు బుధవారం జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపు పన్ను రికవరీ చేయడం వల్ల ఆరువందల మంది విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నవంబరు నెల నుంచే వార్షిక పింఛను రాబడి, పొదుపును మదింపు చేసి మూడు విడతల్లో ఆదాయపు పన్ను వసూలు చేయాల్సి వుందన్నారు. కొత్త చట్టం మేరకు ఏడున్నర లక్షల వార్షికాదాయం వరకు పన్ను మినహాయింపు వుందని, ఈ నిబంధనలను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా మదింపు వేసి, ఆరు లక్షల వార్షిక పింఛను వచ్చే వారికి కూడా ఫిబ్రవరి నెలలో ఒకేసారి రికవరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలకు బాధ్యులైన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతామని విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి జయరాంనాయుడు, సహాయ అధ్యక్షులు యుగంధర్‌రాజు, గోపాల్, కోశాధికారి సిద్దయ్య, రాష్ట్ర మహిళా సంఘ కార్యదర్శి కృపావరమ్మ, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం



ఓటు హక్కు అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 13: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సీఈవో అనుమతించిన ఓటరు జాబితా నుంచి గూడూరు 538, సూళ్లూరుపేట 605, వెంకటగిరి 744, చంద్రగిరి 1,680, తిరుపతి 856, శ్రీకాళహస్తి 571, సత్యవేడు 76 తొలగింపులకు అనుమతి వచ్చిందని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక అనుసరించాలని సూచించారు. ఈవీఎంలపై ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. వాటి రవాణాలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి పోలీసు అధికారులకు సూచనలు చేశామన్నారు. డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 15 నుంచి 2024 మార్చి 11 నాటికి ఫారం 6, 7, 8కు సంబంధించి 11,516 పెండింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈఆర్వోలు అదితిసింగ్, చంద్రముని, నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు




కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి - గరుడవాహనం పై విహరిసస్తున్న శ్రీహరి

కమనీయం... శ్రీనివాసుడి కల్యాణం

తొట్టంబేడు, మార్చి 13: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో వెలసిన టీటీడీ అనుబంధ శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ అర్చకులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణమండపానికి చేర్చగా వేదపండితులు వేదమంత్రోచరణల మధ్య దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుని కల్యాణం జరిపించారు. అనంతరం శ్రీవారు గరుడవాహనం పై విహరించారు.

15న అభినందన సభ

శ్రీకాళహస్తి, మార్చి 13: శ్రీకాళహస్తి పట్టణంలోని దుర్జటి కళా ప్రాంగణంలో ఈనెల 15వ తేదీన అభినందన సభ నిర్వహించినట్లు ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమిష్టి కృషితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జయప్రదం చేసేమన్నారు. ఉత్సవాల్లో భాగస్వాములైన వారందరూ అభినందన వేడుకకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సత్యవేడు అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



అచ్చెన్నాయుడిని కలసి దరఖాస్తు అందిస్తున్న దశరథవాసు

సత్యవేడు, మార్చి 13: సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరథవాసు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాయలసీమ జోన్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి లను కలసి తన అభ్యర్థిత్వ పత్రాన్ని అందించారు. 2014,2019 ఎన్నికల్లోనూ దరఖాస్తు చేసుకుని ప్రయత్నించానని పార్టీ నిర్ణయం మేరకు బీ ఫాం ఇచ్చిన వారికి గెలుపు కోసం కృషి చేశానన్నారు. నింద్ర మండల పార్టీ అధ్యక్షుడిగా మూడు సార్లు పార్టీకి సేవలందించానని గుర్తు చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి చెందిన తమిళ ఎఈస్సీ ఓటర్లు అధికసంఖ్యలో ఉండడంతో పాటు ఏడు మండలాల్లోను బంధు, మిత్రులు, అనుచరులున్నారని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

పిచ్చాటూరు, మార్చి 13: తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై కోళ్ళఫారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రాజేంద్ర(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా...నింద్ర మండలం కొప్పేడు దళితవాడకు చెందిన రాజేంద్ర కొప్పేడు నుంచి పిచ్చాటూరుకు బుధవారం ఉదయం నడిచి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ వెంకటేశ్వరులు సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఏర్పేడు, మార్చి 13: మండలంలోని రాజులపాళెం గ్రామ పంచాయతీలో కొత్త హరిజనవాడకుచెందిన పాపమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌చార్జి కిష్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వరదయ్యయాదవ్, రత్నయ్యయాదవ్, రమేష్, సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సుభాష్‌చంద్ర పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: పోలీసులకు ఫిర్యాదు

ఏర్పేడు, మార్చి 13: మండలంలోని వికృతమాల సమీపంలో నివశిస్తున్న ఓ యువతి(22) అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఏర్పేడు పోలీసులకు బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. వికృతమాల సమీపంలో ఓ ప్రైవేటు కర్మాగారంలో యువతి ఆరు నె లలుగా పనిచేస్తోందని, మంగళవారం విధులకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కో సం తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పలు కుటుంబాలకు బృందమ్మ పరామర్శ

తొట్టంబేడు, మార్చి 13: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో మృతి చెందిన పలు కుటుంబాలను బుధవారం బొజ్జల బృందమ్మ పరామర్శించారు. శ్రీకాళహస్తి మండలంలోని చుక్కల నిడిగల్లు ఎస్టీకాలనీలో చందమామల వెంకటయ్య మృతిచెందిన విషయం తెలుసుకొన్న ఆమె వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. తొట్టంబేడు మండలం గురప్పనాయుడు కండ్రిగకు చెందిన వట్టికుండల సుబ్బమ్మ ఇటీవల మృతి చెందారు. ఇదే గ్రామంలో ఇటీవల గౌస్‌బాషా మృతి చెందారు. వారందరి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

యూకలిప్టస్ తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

- వివరాలు వెల్లడించని ఏపీఎఫ్‌డీసీ



ఏపీఎఫ్‌డీసీ కార్యాలయ ఆవరణలో ఉన్న ట్రాక్టర్

సత్యవేడు, మార్చి 13: ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) సత్యవేడు రేంజ్ పరిధిలో యూకలిప్టస్ చెట్ల ను నరికి దొంగతనంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్ ను అధికారులు స్వాధీ నం చేసుకుని కార్యాలయానికి తరలించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనపై సం బంధిత అధికారులు ఇంత వరకు వివరాలు బయటకు వెల్లడించక గోప్యం గా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సత్యవేడు ఏపీఎఫ్‌డీసీ రేంజ్ పరిధిలోని అరుదూరు ప్లాంటేషన్‌లో మంగళవారం కొంతమంది అక్రమంగా యూకలిప్టస్ చెట్లు నరికి కలప తరలిస్తుండగా ప్లాంటేషన్ సిబ్బంది పట్టుకుని సత్యవేడులోని కార్యాలయానికి తరలించారు. ఈ వ్యవహారంలో ఇంటిదొంగల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాఖలోని ఇద్దరు ఉద్యోగులు యూకలిప్టస్ చెట్లు దొంగతనంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.వీరిద్దరు బినామీ పేర్లతో కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి ఎక్కువ టన్నుల్లో కలప నరికి, తక్కువగా చూపించి లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయమై సంబంధిత డీఎం బ్రహ్మయ్యను వివరణ కోరగా కలప దొంగతనంపై విచారణ జరుపుతున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

కైలాస గిరులకు నిప్పు

శ్రీకాళహస్తి, మార్చి 13: ముక్కంటి ఆలయానికి సమీపంలోని తుఫాన్ సెంటర్ ఎస్టీ కాలనీ వద్ద కైలాస గిరిలపై మంటలు వ్యాపించాయి. అధికార యంత్రాంగం సకాలంలో అప్రమత్తం కావడంతో ముప్పు తప్పింది. వేసవి తీవ్రతతో పాటు ఆకతాయిల కారణంగా కైలాసగిరిల్లో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆలయ భద్రత సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక వాహనం, ఓ ఫ్యాక్టరీ సహాయంతో అగ్నిమాపక పరికరాలను ఘటనా స్థలానికి తెప్పించారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు గంట పాటు శ్రమించి మంటలు వ్యాపించకుండా కట్టడి చేశారు.

నేడు శ్రీకృష్ణదేవరాయ విగ్రహావిష్కరణ

శ్రీకాళహస్తి పట్టణంలోని రాజగోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నట్లు ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- 12వ రోజు
  (పాల్గుణ శుద్ధ పంచమి, గురువారం)
  ఉభయదారులు....
  కండ్రిగ వెంకటరమణారెడ్డి, కండ్రిగ ఉమ
  (మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు)

వాహన సేవ

- రాత్రి 8 గంటలకు పల్లకీ సేవ

నిత్యోత్సవాల వివరాలు

- ఉదయం 4.30గంటలకు: మంగళవాయిద్యాలు
- ఉదయం 5గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 5.30 గంటలకు: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 8గంటలకు స్వామి అమ్మవార్ల పల్లకీ ఉత్సవం
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు

శ్రీసిటీ ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ వితరణ

- అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎన్ఎస్ కంపెనీ ప్రతినిధులు

శ్రీసిటీ, మార్చి 13: శ్రీసిటీలోని ఆటో మొబైల్ కాంపోనెంట్ తయారీ సంస్థ ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ, సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా గొల్లవారిపాళెం గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి బుధవారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి రూ.29 లక్షలు వెచ్చించనుండగా ఇందుకు అవసరమైన భూమిని శ్రీసిటీ విరాళంగా ఇచ్చింది.ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ తకావో ఇకరాషి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు కోజి ఒగుమా, సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయికృష్ణ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చిన టీడీపీ నాయకుడు



వరదయ్యపాళెం, మార్చి 13: మండలంలోని కంచరపాళెం పంచాయతీలో మూడు రోజులుగా తాగునీరు రాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుర్తించి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిమాజీ సర్పంచ్ దశరథన్ బుధవారం ఎస్టీకాలనీ వాసుల తన సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చారు. దీంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కరకంబాడిలో గడప గడపకు బీజేపీ

రేణిగుంట, మార్చి 13: మండలంలోని కరకంబాడి గుండాల కాల్వ గ్రామంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేంద్రనాయుడు, బీడీ బాలాజీ, చంద్రశేఖర్‌రెడ్డి, తేజవతి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, యోగేశ్వర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైవేద్యం పాత్రల వితరణ



పాత్రలు అందజేస్తున్న సాయి కిషోర్

శ్రీకాళహస్తి, మార్చి 13: పట్టణానికి చెందిన రాజా సాయి కిషోర్ అనే వ్యక్తి శ్రీకాళహస్తీశ్వరాలయానికి నాలుగు ఇత్తడి నైవేద్యం పాత్రలను వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ పరిపాలన భవనంలో చైర్మన్ అంజూరు శ్రీనివాసులును కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఆవుల పాటి శ్రీనివాసులు, కంఠా ఉదయ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి పట్టణానికి చెందిన హేమంత్ రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. బుధవారం ఆలయంలో చైర్మన్ శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, మార్చి 13: రోడ్డు ప్రమాదంలో ముని కుమార్ అనే సచివాలయ ఉద్యోగి గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తికి చెందిన ముని కుమార్ ఇదే మండలంలోని అమ్మపాలెం సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని బ్యాంకులో కార్యకలాపాల కోసం వెళ్ళాడు. రోడ్డు దాటుతుండగా ముని కుమార్ ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వైభవంగా ముక్కంటి వసంతోత్సవం

- నేత్రపర్వంగా కేడిగ వాహన సేవ



వసంతోత్సవంలో స్వామివారు, త్రిశూలానికి హారతులు సమర్పిస్తున్న ప్రధాన అర్చకులు



కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మార్చి 13, ముక్కంటీశుడి వసంతోత్సవ కార్యక్రమాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగించి సూర్యపుష్కరిణి వద్ద వసంత మండపంలో కొలువుదీర్చారు. ఉమాదేవి సమేత, చంద్రశేఖర స్వామి కొలువుదీరిన త్రిశూలాన్ని ఆలయ అనువంశిక ప్రధానార్చకుడు స్వామినాధన్ గురుకుల్ సూర్యపుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. తరువాత ప్రధానార్చకులు నేతృత్వంలో సంకల్పం పూజలు, త్రిశూలానికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 11వ రోజైన బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లకు కేడిగ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం కేడిగ వాహనంపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



కేడిగ వాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

నేడు పల్లకీసేవ

శ్రీకాళహస్తి, మార్చి 13: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే పల్లకీసేవ ఉత్సవానికి ఎంతో వైశిష్ట్యం ఉంది.. కల్యాణోత్సవ సమయంలో గంగాదేవిని వివాహమాడిన విషయాన్ని పమరశివుడు గోప్యంగా ఉంచడంపై అలక భూనుతుంది. ఆపై ఆగ్రహంతో అలిగిన అమ్మవారు ముందుగా పల్లకీలో వెళ్లిపోతారు. వెనుక మరో పల్లకీలో జగదాంబను బుజ్జగిస్తూ సర్వేశ్వరుడు వెంబడించడం ఈ పల్లకీ సేవ పరమార్థం. ఈ విశేష మహోత్సవం పురస్కరించుకుని కోపంగా ఉన్న ఆదిశక్తిని అద్దం ద్వారా చూసి భక్తులు దర్శించుకుంటారు.



ఆలయ అభివృద్ధే ధ్యేయం

శ్రీకాళహస్తి, మార్చి 13: ముక్కంటి ఆలయ అభివృద్ధి ధ్యేయంగా ధర్మకర్తల మండలి పనిచేస్తుందని చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఆలయంలోని పరిపాలనా భవనంలో బుధవారం కొత్త ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా... చైర్మన్ శీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, హాజరైన సభ్యులు, అధికారులు

గర్వం వీడితేనే శివుడి అనుగ్రహం

- మేడసాని మోహన్



హాస్యబ్రహ్మ శంకర నారాయణ రచించిన గంగతల్లి శతకం పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం




మేడసాని మోహన్ ప్రవచనాలు - అరవింద బృందం నృత్య ప్రదర్శన

తొట్టంబేడు, మార్చి 13: మనుషుల్లో దాగివున్న గర్వం వీడితేనే పరమశివుడి అనుగ్రహం లభిస్తుందని ప్రముఖ సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో ఆధ్యాత్మిక, హాస్య, నృత్యప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మేడసాని మోహన్ మాట్లాడుతూ శివుడిని హేళన చేసి కుష్టువ్యాధి బారిన పడిన నక్కీరుడు శ్రీకాహస్తీశ్వరుడిని దర్శించి శాపవిమోచనం పొందినట్లు వివరించారు. మహాకవి ధూర్జటి శివయ్యను కీర్తిస్తూ శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని రచించారని చెప్పారు. ముందుగా ప్రముఖ హాస్యవధాని డాక్టర్ శంకరనారాయణ రచించిన గంగతల్లి శతకాన్ని మిమిక్రీ ఆర్టిస్టు బవిరిరవి, దేవస్థానం అధికారుల చేతులమీదుగా ఆవిష్కరించారు. హాస్యావధాని డాక్టర్ శంకరనారాయణ లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్, గౌరవ డాక్టరేట్, దేశవిదేశాలలో 25 సంవత్సరాలుగా 450 హాస్యావధానాలు, 15 అష్టవధానాలు చేసి 108 అవార్డులు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి శంకరనారాయణ పత్రికల్లో కాలమిస్టుగా, వక్తగా, వాస్తుశాస్త్రవేత్తగా పేరుతెచ్చుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్, బృందం నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం శ్రీకాళహస్తి, అరవింద నృత్యకేళి బృందం నృత్య ప్రదర్శన, విజయవాడకు చెందిన బవిరిరవి మిమిక్రీ భక్తులను మైమరిపించాయి. కళాకారులను దేవస్థానం అధికారులు స్వామిఅమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

టీడీపీతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి



కోటా చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేస్తున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 13: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాయి బ్రాహ్మణులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆపార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ఆయన స్వగృహంలో టీడీపీ సీనియర్ కార్యకర్త కోటా చంద్రశేఖర్‌ను నాయి బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఆలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి, నాయకులు ఉమేష్ రావు, మిన్నల్ రవి, బుజ్జి, సురేంద్ర యాదవ్, భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి కోరారు. ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. టీడీపీ నాయకులు మునిరంగారెడ్డి, ధనంజయుల నాయుడు, శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, పొన్నారావు, గురవారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న కనికట్టు.. ఇల్లు ఇచ్చినట్టుగా పాంప్లేట్



తనకు పక్కాఇల్లు ఇచ్చినట్లు వేసిన కరపత్రాన్ని చూపుతున్న నాగమ్మ

వరదయ్యపాళెం, మార్చి 13: ఇంటి స్థలం, పక్కాఇల్లు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా గడపగడపకు ఇస్తున్న కరపత్రాలను చూసి ఓ మహిళ నివ్వెరపోయింది. ఇది జగన్న కట్టుకథ అంటూ నాగమణి అనే మహిళ వాపోయింది. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ తూర్పు ఎస్టీకాలనీకి చెందిన ఎం.నాగమణికి ప్రభుత్వం ద్వారా వైఎస్ఆర్ ఆసరా, అమ్మఒడి, కొవిడ్‌సాయం, సున్నావడ్డీ పథకం కింద రూ.91.800 లబ్ధి పొందింది. అయితే ఇటీవల వాలంటీరు ఇచ్చిన కరపత్రంలో ఇంటి స్థలం విలువ రూ.2లక్షలు, ఇల్లు రూ.2.50లక్షలు మొత్తం రూ.5,41,880 ఇచ్చినట్లు నమోదు కావడంతో ఆమె ఆశ్చర్యపోయింది. కాలనీలో పలువురికి పంచాయతీ పరిధిలో అరికసేనువద్ద వాగు పక్కనే రవాణా వసతి లేని చోట జగనన్న కాలనీ కింద ఇంటి పట్టా ఇచ్చారని ఆమె తెలిపింది. అయితే అక్కడ రూ.10వేలు కూడా విలువ చేయని ఆ స్థలాన్ని రూ.2లక్షలు అని చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. అంతే కాకుండా తమకు ఇచ్చిన జగనన్న కాలనీలో ఒక్క నిర్మాణం కూడా జరగకపోవడంతో రద్దుచేశారని ఆమె అన్నారు. ఊరికి దూరంగా రోడ్డువసతి లేని ఆ కాలనీకి వెళ్లలేక ఇక్కడే పూరిపాకలో నివాసం ఉంటున్న తమకు కనీసం పక్కా ఇళ్ల కూడా మంజూరు చేయలేదని ఆమె వాపోయింది. అయితే పక్కా ఇళ్లు ఇవ్వకుండా రూ.2.50లక్షలు ఇచ్చినట్లు సీఎం జగన్‌లేఖలో దొంగ లెక్కలతో నమోదు చేయడంతో ఆ నిధులు ఎవరు స్వాహా చేశారని ఆమె ప్రశ్నిస్తోంది. ఎన్నికల ప్రచారానికి వచ్చే అధికార పార్టీ నాయకులను ఇదే విషయంపై నిలదీస్తానని ఆమె తేల్చి చెబుతోంది.